456) గుండక్రియ

ప॥ తలపులో కొట్టగొన దైవమే వున్నాడు। తలచినరూపులెల్లా తా నయ్యీనయ్యా॥

చ॥ కలలో ప్రపంచము కంటి నే నొకటి। వెలినున్న ప్రపంచవిధివలెనే।
కలనున్నవాడ నేనే వెలి నున్నవాడ నేనే। తెలియ మాబతుకు రెంట దెప్పరములయ్యా॥

చ॥ దేహమీద నుండగానే దిక్కులకేగీ మనసు। దేహముతో దిక్కులెల్లా దిరిగినట్టే।
దేహములోవాడ నేనే దేహముపైవాడ నేనే। వోహో మాజన్మములో నొకటి రెండయ్యా॥

చ॥ కన్నులెదుట శ్రీవేంకటపతి గొలిచెద। కన్నుమూసి యాతనినే కమ్మర భావించెదను।
కన్నులలోపల నేనే కన్నుల వెలిని నేనే। వున్నతి నీరెండును వొక్కటాయనయ్యా॥